17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,21 ఫిబ్రవరి 2024


# జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రాంతాలలో పర్యటించిన కలెక్టర్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** కడియపు లంక, బుర్రి లంక, కాటన్ బ్యారేజి ప్రాంతాల్లో ఇసుక త్రవ్వకాలు నేపథ్యంలో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఈ ప్రాంతాలలో పర్యటించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ డా కె.మాధవీలత తెలియచేశారు. మంగళవారం ఎన్ జీ టి (జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్) బృంద సభ్యులు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రీజినల్ డైరెక్టరేట్, చెన్నై శాస్త్రవేత్త డి.. సౌమ్య, పర్యావరణ కాలుష్య నియంత్రణ ఇంజనీర్, (కాకినాడ) బిహెచ్ ఎల్ సందీప్ రెడ్డి , ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ఆర్ సతీష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, మైన్స్ & జియాలజీ, తూర్పు గోదావరి ఎమ్. సుబ్రహ్మణ్యం తదితరులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ హేడ్ వర్క్స్ ఈ ఈ ఆర్. కాశీ విశ్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

–కాటన్ బ్యారేజి మరమ్మత్తు పనులను పరిశీలించిన కలెక్టరు –అనంతరం బ్యారేజ్ మరమ్మత్తు పనులను పరిశీలించిన కలెక్టర్ మాధవీలత, కోనసీమ జిల్లాకి చెందిన బొబ్బర్లంక, పిచ్చుకల్లంక వద్ద కొన్ని పనులు పెండింగులో ఉన్నాయనీ, వాటినీ చేపట్టే నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కి వివరించారు.

# ఘనంగా భీష్మ ఏకాదశి






### – రథోత్సవాలు – కళ్యాణాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రాణాలు విడిచిన వీరుడు భీష్ముడు. మాఘమాసంలో వచ్చే ఏకాదశిని భీష్మ ఏకాదశి అంటారు. మహాభారతంలోని భీష్మ పర్వం ఈ భీష్మ ఏకాదశి గురించి వివరించింది. మంగళవారం భీష్మ ఏకాదశి కావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కాకినాడ జిల్లా కాకినాడ శ్రీ వెంకటేశ్వరస్వామి, భానుగుడి సూర్యనారాయణస్వామి, సర్పవరం భావన్నారాయణస్వామి, గొల్లలమామిడాడ సూర్యనారాయణమూర్తి, పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి, అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామి, కాకినాడ జగన్నాధపురం, వెంకటనగర్ శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయాలు వేలాదిమంది భక్తులతో కిటికీటలాడాయి. పుట్టకొండ, గొల్లలమామిడాడలో వేకువఝామునే అభిషేకాలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా రథోత్సవాలను నిర్వహించారు. మాఘమాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని జయ ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఈరోజున విష్ణుమూర్తిని పూజిస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో అన్ని ఆలయాలు కూడా కిటకిటలాడాయి. భీష్మ ఏకాదశి రోజునే విష్ణు సహస్రనామాన్ని భీష్ముడు పాండవులకు అందజేశాడు అని చెబుతారు. ఈ నేపథ్యంలో వేకువఝామున అభిషేకాలు, అర్చనలు తరువాత రథోత్సవాలు నిర్వహించారు. గొల్లల మామిడాడ సూర్యనారాయణమూర్తికి శాంతి కళ్యాణం నిర్వహించారు. కాకినాడ జిల్లా వేలాది మంది భక్తులతో కిటికీటలాడిపోయింది. అన్ని రహదారులు ఆలయాలకు దారితీసాయి.దేవాదాయశాఖ ప్రత్యేకఏర్పాట్లు చేసింది. ఆ శాఖ అధికారులు ఆలయాలు తనిఖీ చేశారు. భక్తులకు సకల సౌకర్యాలు సమకూర్చారు. శ్రీ సూర్యనారాయణ.. వేద పారాయణ..లోకరక్షామణిఅంటూసూర్యనారాయణమూర్తినికొలిచారు. భాభన్నారాయణ స్వామికి తమ మనసులోని భావాలు చెప్పుకున్నారు. అన్నవరం సత్యనారాయణ స్వామికి వ్రతాలు చేసుకున్నారు. పుట్టకొండ, గొల్లలమామిడాడలలో రథోత్సవాన్ని నిర్వహించారు. అన్ని రహదారులు ఆలయాలకే దారితీసాయి. తూరుపు తెలతెల తెల్లవారకముందే ఆలయాలలో భారీ క్యూ లైన్లు కనపడ్డాయి. భీష్మ ఏకాదశికి అంతటి వైశిష్టత, ప్రాధాన్యత ఉంది.ద్రాక్షారామ పంచారామ క్షేత్రం శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయంలో అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి కళ్యాణ మహెూత్సవం వేలాదిమంది భక్తుల సమక్షంలో జరిగింది. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవానికి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా జాయింట్ కమిషనర్ మేడేపల్లి విజయరాజు వ్యవహరించారు.అలాగేపుట్టకొండలక్ష్మీ నరసింహ స్వామి వారి రథోత్సవం అనంతరం గ్రామ సేవ, ఆపై గరుడసేవ నిర్వహించారు. అరట్లకట్ట శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కళ్యాణ మహెూత్సవం, యండమూరు మీసాల వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహెూత్సవాలు భక్తుల జయజయ నాదాల మధ్య వైభవంగా జరిగాయి. వాడపల్లి వెంకన్న, కాకినాడ జగన్నాధపురం వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ పులినారాయణమూర్తి,ఇన్స్పెక్టర్లువడ్డి శ్రీనివాస్, బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యనిర్వహణ అధికారులు వి.తారకేశ్వరరావు,సత్యవాణి,చీమలకొండ వెంకటరమణ మూర్తి, వడ్డాది సత్తిబాబు, ఎం.మురళి వీరభద్రరావు, వరిపల్లి శ్రీనివాసరావు, జొన్నాడ భీమశంకరం, వడ్డి శ్రీనివాసరావు ఆయా ఆలయాలలో భక్తులకు సకల సౌకర్యాలు సమకూర్చారు. అత్యంతభక్తిశ్రద్ధల మధ్య భీష్మ ఏకాదశి పర్వదినంని భక్తులు నిర్వహించుకున్నారు. పలు ఆలయాలలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.

# పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు

– ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాల సందర్శించిన ఐటీడీఏ పీవో




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి, పరీక్షలపై వారికి అవగాహన కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే టీచర్లకు సూచించారు. రంపచోడవరం మండలం ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించి, విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. ముందుగా పదో తరగతి క్లాస్ రూములు పరిశీలించి విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీసారు.

ఈ సంవత్సరం ఏజెన్సీ ప్రాంతంలో అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో పాస్ కావాలని, విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ఏవిధంగా పదో తరగతి పరీక్షలు వ్రాయాలో అర్థం చేసుకొని, విద్యార్థులు పాఠాలను రోజుకొక సబ్జెక్టు చొప్పున చదవాలన్నారు. అనంతరం పాఠశాలలో ప్రతీరోజు మెనూ ప్రకారం ఆహారం సరఫరా ఏవిధంగా అమలు జరుగుతున్నది పరిశీలించారు. అదేవిధంగా వెండర్లు నిత్యావసర సరుకులు, కాయగూరలు, వారానికి రెండు రోజులపాటు కోడి మాంసాన్ని సరఫరా చేస్తున్నారో లేదో ఆయన ఆరా తీశారు. అనంతరం పాఠశాల హాస్టల్‌లో సరుకులుకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సమీక్ష నిర్వహించారు. పిఓ వెంట గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబు సలాం, ఏటిడబ్ల్యూఓ రామతులసి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా లక్ష్మీ జనార్దనుడి కళ్యాణం



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరంలోని ధవళగిరిపై వెలసిన లక్ష్మీ సమేత జనార్ధనుడి రథోత్సవము కళ్యాణము మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. వివిధ గ్రామాల నుండి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారి ఆశీర్వాదాలు కోసం పోటీపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం రథ సంప్రోక్షణ ద్వారా కళ్యాణఏర్పాట్లు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు పుష్పాభిషేకములు సంప్రోక్షణలతో సాంప్రదాయ పద్ధతిగా కన్నుల పండుగ జనార్ధనుడు వివాహ వేడుకలు జరిగాయి. రాష్ట్ర మంత్రివర్యులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనాన్ని చేసుకొనగా ఆయన చేతుల మీదుగా రథమును కదిలించడం ద్వారా రథోత్సవం జరిగింది. జనార్ధన స్వామి గ్రామ ప్రజలను నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని మంత్రి పూజలు నిర్వహించి జనార్ధన స్వామిని కోరారు. రథం వీధి నుండి పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు స్వామి వారు రథాన్ని అధిరోహించి పెండ్లి కుమారుడుగా ముస్తాబై పురవీధుల్లో ఊరేగారు. ప్రత్యక్షంగా తిలకించేందుకుఈఏడాది విశేషంగా భక్తులు తరలివచ్చారు. వీధులన్నీ దేవస్థానం వరకు ఇరుపక్కల అంగళ్లతో విద్యుత్ దీపాలంకరణతో నిండిపోయాయి. స్వామిని జనసేన తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ కూడా స్వామిని దర్శించిన ప్రముఖుల్లో ఉన్నారు ప్రశాంతంగానూ అత్యంత వైభవంగానుఈవేడుకలు నిర్వహించడంలో గ్రామపంచాయతీ విద్యుత్ శాఖ వైద్యశాఖ పోలీస్ సిబ్బంది శ్రమించారని ఆలయ ధర్మకర్తల మండలి హర్షాన్ని వ్యక్తపరిచారు.

## రాష్ట్ర అభివృద్ధి తెదేపా చేతుల్లో ఉంది

– క్రైస్తవులను అన్నివిధాలా ఆదుకుంటాను
– పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో మద్దిపాటి వెంకటరాజు



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విద్యావంతులు, సుదీర్ఘ రాజకీయానుభయం ఉన్న వ్యక్తులు పాలకులుగా ఉండాలని తెలుగుదేశం పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. గోపాలపురంలో పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చెయ్యాలనే ఉద్దేశంలో 2.5లక్షల ఉద్యోగాన్ని వదిలిపెట్టి వచ్చానని తెలిపారు. ఈ సారి ఖచ్చితంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాస్టర్లను అన్నివిధాల ఆదుకుంటామని తెలిపారు. గౌరవవేతనం పెంపు, ఇన్సూరెన్స్ చేయిస్తామని తెలిపారు. అంతేకాకుండా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠినమైన చర్యలు రాబోతున్న తమ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పాస్టర్లు, జ్యేష్ట శ్రీధర్, వడ్లమూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద జిల్లాలో 367 జంటలకు రూ.2.66 కోట్ల లబ్ధి



– జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద అక్టోబర్– డిసెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 367 జంటలకు రూ.2.66 కోట్ల రూపాయల ఆర్థిక సాయం లబ్ది పొందుతున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సోమారంనాడు పేదింటి ఆడపిల్లలకు పెళ్లి కానుకగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా. అక్టోబర్–డిసెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు", "వైఎస్సార్ షాదీ తోఫా" క్రింద ఆర్థిక సాయాన్ని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో నిధులు విడుదల చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, డిఆర్‌డిఏ పిడి శ్రీరమణ, మెప్మా పీడి ప్రియంవద, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేందుకు అండగా నిలుస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు" ద్వారా, మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న తపనతో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలకు పదవ తరగతి ఉత్తీర్ణత, వధువుకు కనీస వయోపరిమితి వదువుకి 18 ఏళ్ళుగా, వరునికి 21 ఏళ్ళుగా ప్రభుత్వం నిర్దేశించింది. చిన్నారులు పదో తరగతికి వచ్చే సరికి వారికి 15 ఏళ్ళ వయసు వస్తుంది, ప్రభుత్వం 1వ తరగతి నుండి అప్పటికే ఏటా అందిస్తున్న రూ.15,000 జగనన్న అమ్మ ఒడి సాయం ఇంటర్ వరకూ కూడా ఇస్తుండటంతో వారికి 17 ఏళ్ళ వయస్సు వచ్చే సరికి వారి ఇంటర్ చదువు కూడా పూర్తవుతుంది. కళ్యాణమస్తు, షాదీ తోఫాలలో వధువుకు 18 ఏళ్ళు, వరునికి 21 ఏళ్ళ వయోపరిమితి ఉండటం, ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్, జగనన్న వసతి దీవెన ద్వారా ఏటా రూ.20,000 వరకు ఆర్థిక సాయం ఎలాగూ అందిస్తుండడంతో పాటు కళ్యాణమస్తు, షాదీ తోఫా ప్రోత్సాహకాలు కూడా ఉండడంతో వారు గ్రాడ్యుయేషన్‌లో చేరుతారు, పూర్తి చేస్తారన్న నమ్మకంతోపాటు బాల్య వివాహాలకు కూడా అడ్డుకట్ట వేయడం జరుగుతుందన్న తపన, తాపత్రయంతో ప్రభుత్వం పనిచేస్తుందని కలెక్టర్ అన్నారు.వైఎస్సార్ కళ్యాణమస్తు/ వైఎస్సార్ షాదీ తోఫా పథకం ప్రారంభించినప్పటి నుంచి ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం పూర్తయిన వెంటనే చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## జిల్లాకు చెందిన క్రీడాకారుడు చల్లారపు శివ క్రికెట్ అకాడమికి ఎంపిక

– అభినందించిన కలెక్టర్ మాధవీలత
– రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ తరపున శివకు క్రికెట్ కిట్ అందచేత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ద్వారా తగిన గుర్తింపు లభించడం, తద్వారా మరింత తర్ఫీదు కోసం క్రికెట్ అకాడమీ కి ఎంపికైన చల్లారపు శివ రానున్న రోజుల్లో జిల్లాకు, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత అభినందనలు తెలిపారు. మంగళవారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా స్పోర్ట్స్ ఆధారిటి అధికారులు క్రికెటర్ శివ తో కలిసి కలెక్టర్ కలవడం జరిగింది. ఈ సందర్భంగా, కలెక్టర్ కె. మాధవీలత క్రికెటర్ శివ కి అభినందనలు తెలిపారు. సచివాలయం స్థాయి నుంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, రాష్ట్ర స్థాయి కి చేరుకున్న చల్లారపు శివ ఎంతో మందికి స్ఫూర్తి నివ్వడం జరిగిందనీ పేర్కొన్నారు. అండర్ 21 కేటగిరీ లో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అకాడమి కి శిక్షణ నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ క్రికెట్ అకాడమి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అండర్ 21 కేటగిరీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కి త్వరలో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉందని అన్నారు. మరింత ప్రతిభ ప్రదర్శించి ఉన్నత స్థాయి కి చేరుకోవాలని అభిలాష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ తరపున శివకు క్రికెట్ కిట్ ను అంద చేశారు. మంచి క్రీడాకారుడుగా గుర్తింపు తెచ్చుకోవాలని, జిల్లా తరపున ఎటువంటి సహాయం కావలసి వచ్చినా మద్దతుగా నిలవడం జరుగుతుందనీ అన్నారు. అనపర్తి కి చెందిన తల్లితండ్రులు జనార్ధన్ రావు – పార్వతి లు దినసరి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబానికి చెందిన, శివ చిన్నప్పటి నుంచి క్రికెటర్ కావాలనే కోరిక తో నిరంతర కృషి చేసినట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నంలో ఆడుదాం ఆంధ్రా పోటీలలో పాల్గొన్న క్రికెటర్ల యొక్క ప్రతిభ ఆధారంగా క్రికెట్ అకాడెమీ కి శివ ఎంపిక అయినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో దేశానికి కూడా ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందనీ తెలియ చేశారు.కలెక్టర్ శివతో కలిసిన వారిలో బాస్కెట్ బాల్ కోచ్ ఎన్. మోహన్ దాస్, యోగా కోచ్ బివిజీ నాగేంద్రన్ లు ఉన్నారు.

## కోళ్ళఫారాలను పరిశీలించిన పశువైద్యాశాఖాధికారులు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలంలోని కోళ్ళఫారాలను పశు వైద్యశాఖ ఉన్నతాధికారులు (పశు సంవర్ధక శాఖ సంచాలకులు) ఆదేశాల మేరకు మంగళవారం బర్డ్‌ఫ్లూకి సంబంధించి, కోళ్లఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాకినాడ డివిజన్ ఉప సంచాలకులు డా.ఆర్.వెంకటేశ్వరరావు, పశు రోగ నిర్ధారణ కేంద్రం వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ డా.సందీప్‌తో కలసి కోళ్ళను పరిశీలించారు. కోళ్ళల్లో బర్డ్‌ఫ్లూకి సబంధించి ఎటువంటి లక్షణాలు లేవని, దానికి సంబంధించి మరణాలు నమోదు కాలేదని, ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఇది మనుషులకు సంక్రమించే వ్యాధి కాదని, ప్రజలు భయాందోళనలకు గురి కావలసిన అవసరం లేదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఏరియా వెటర్నరి హాస్పటల్ సహాయ సంచాలకులు డా. టి.ఎన్.వి.ఎ.రామస్వామి, ఆర్.బి.పట్నం వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ డా.కె.రాజేష్, మరియు పశు సంవర్ధక శాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు వందనం...

– ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లే వారధులు
– కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లే వారదులని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం మండలం మరియు పట్టణంలో గల వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. పలువురు వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఎం జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్ల, సచివాలయ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిగా మన రాష్ట్రంలోనే ప్రవేశపెట్టారని, మన వ్యవస్థలను ప్రపంచం మొత్తం చూసి హర్షిస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత వాలంటీర్లదేనని అన్నారు. గ్రామ, వార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వాలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి ప్రతి ఏడాది సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అనే పురస్కారాలను నగదు అందజేస్తూ సత్కరించడం జరుగుతుందన్నారు. వాలంటీర్లు స్వచ్ఛంద సేవకులుగా ఉంటూ వారికి కేటాయించిన పరిధిలోని 50 కుటుంబాలలో కుటుంబ సభ్యులుగా ఉంటూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వారి చెంతకు చేరవేస్తూ మన్ననలను పొందడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాన్ని , సంతృప్తిని అందిస్తున్న వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. వాలంటీర్లను లబ్ధిదారుల ఇంటి వ్యక్తులుగా గుర్తిస్తూ వారికి తగిన గౌరవం, అభిమానాన్ని అందిస్తున్నారన్నారు. భవిష్యత్తులో గ్రామ, వార్డు సచివాలయాల అభివృద్ధికి వాలంటీర్లు కృషి చేయాలని లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఏమ్ పి వంగా గీత విశ్వనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు (బాబీ), మున్సిపల్ కమీషనర్ కనకారావు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పుట్టకొండ లక్ష్మి నరసింహుడి రధోత్సవం



**పెదపూడి, మేజర్ న్యూస్ :** పెదపూడి మండలం పుట్టకొండ లో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో భీష్మ ఏకాదశి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబెర్ అనంతాచార్యులు ఆధ్వర్యంలో 60 మంది వైష్ణవ అర్చక స్వాముల తో నిర్వహించిన రథోత్సవం అత్యంత కన్నుల పండువగా సాగింది. ఈ రథోత్సవంను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండి ఆలయం వద్ద భారులు తీరారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

# ఏకే మల్లవరంలో రూ.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన ఎంపీ గీత



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలోఎంపీ ల్యాండ్స్ 50 లక్షలు నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు అరిగెల అచ్చయ్యమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణాలను కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతావిశ్వనాథ్, గొల్లప్రోలు జడ్పీటిసి ఉలవకాల నాగలావరాజు చేతుల మీదగా ప్రారంభించారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగలియ్యారావు, వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల రామన్న దొర, దుర్గాడ సర్పంచ్ పంపన సూర్యచంద్ర, దుర్గాడ ఎంపీటీసీ ఆకుల శ్రీను, వన్నెపూడి సర్పంచ్ కంద సుబ్రహ్మణ్యం, కంద బాబ్జి, కంద చిన్నబాబు తదితరులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ గూటికి చేరిన ఎమ్మెల్యే ఆళ్ల



**అమరావతి, మేజర్ న్యూస్ :** మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరుకున్నారు. ఇటీవలసిఎం జగన్‌తో విభేదించి కాంగ్రెసు పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ను తిట్టమని కాంగ్రెస్ పార్టీ ఆదేశించిందన్నారు.ఈ అంశం తనకు నచ్చలేదన్నారు. జగన్ తనను రెండు సార్లు ఎమ్మెల్యే చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో పద్దతి పాడు ఏమి లేదన్నారు. రాజకీయాల్లో రాజకీయం, పార్టీ విధానాలు, సిద్ధాంతాలపై మాట్లాడాలి కానీ వ్యక్తిగత దూషణలు సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కానీ షర్మిల విధానం అలా లేదని, కేవలం వ్యక్తిగతంగానే ఉంటుందన్నారు. ఈ విషయం పై ఎన్నోసార్లు ఆమెతో పాటు పార్టీకి చెప్పి చూసాను కానీ వినలేదన్నారు.జగన్ పై వ్యక్తిగతంగా వెళ్లడం తనకు నచ్చలేదని,అందుకే ఆమెతో నడవడం ఇష్టం లేక సొంత గూటికి వస్తున్నానన్నారు.



# రూ.3.5కోట్లతో డ్రైనేజీ పనులకు శ్రీకారం







## -మంత్రి చెల్లుబోయిన



**రాజమహేంద్రవరం రూరల్,మేజర్‌న్యూస్ :** పారిశుధ్య నిర్వహణలో భాగంగా రూరల్ నియోజకవర్గంలోరూ.3.5కోట్లతో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టామని జిల్లా ఇంచార్జ్ మంత్రి,రాష్ట్రబీసీ సంక్షేమ సమాచార పౌర సంబంధాలు, సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాజమండ్రి రూరల్ మండలం ధవలేశ్వరం, బొమ్మూరు గ్రామాల్లో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న మురుగునీరుపారుదలడ్రైనేజీలకు మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివేణుగోపాలకృష్ణ మాట్లాడుతూరూరల్ నియోజక వర్గం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తెస్తే సత్వర పరిష్కరించే దిశగాచర్యలుతీసుకోవడం జరుగుతుందని అన్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రజా ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగాప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం,మురుగునీటి డ్రైనేజీలు నిర్మించే దిశగా నేడు డ్రైనేజీపనులకు శ్రీకారంచుట్టిప్రారంభించుకున్నామని మంత్రి తెలిపారు.ఇప్పటికే ధవలేశ్వరంలో అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేసి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పటిష్టవంతం చేయడం జరిగిందని మంత్రి స్థానికులతోఅన్నారు.

ఇందులో భాగంగా నేడు రు.3.5 కోట్ల రూపాయలతో పలుడ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. అదేవిధంగా రు.2.5కోట్ల రూపాయలతో ఆర్డబ్ల్యూఎస్ ద్వారా జలజీవన్ పథకం క్రింద మంచినీటి పైపులైన్లు నిర్మించి ఇంటింటికి తాగునీటి అందించి త్రాగునీరు సమస్యను పరిష్కరించడం జరుగుతుందనీ అన్నారు. మరో రు.50 లక్షలతో గోదావరి జలాలను అందించేందుకు ప్రస్తుతం ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకుకి అదనంగా మరో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించనున్నామనిఅందుకు అవసరమయ్యే నిధులు కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ రు.30లక్షలతోలక్ష్మీజనార్ధనస్వామి కాలనీలో ,రు.23లక్షలతో ఎర్ర కొండ సాయి నగర్ కాలనీలో,రు.10 లక్షలతో బ్యారేజీ కాలనీలోను, రు.22 లక్షలతో బోట్ ఆఫీసు వీధి డ్రైనేజీ, వడపేట, కంచర్ల లైను, ధవలేశ్వరం, సున్నం బట్టి వీధి, జలారిపేట, కేత వారి వీధి, మార్కెట్ ఏరియా, కొత్తపేట, ఎన్ కే కాలనీ, రాజీవ్ నగర్, ఎర్ర కొండ హైస్కూల్ ప్రాంతాల్లో ఒక్కొక్క డ్రైనేజీ రు.20లక్షల రూపాయలు చొప్పునమొత్తం రు.3.5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎంపీడీవో డి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు తలారి వరప్రసాద్, పందెళ్ళ భాను ప్రసాద్, పేర్ల బాసి, ఎన్ వి శేఖర్, కొత్తపల్లి శివ, మెండా రాజేష్, రేగుళ్ల రాజు, మిరప రమేష్, నంబూరి రవి, గూటం రాజు, పట్టపగలువెంకటలక్ష్మి,కళ్యాణిరెడ్డి, ధర్మ, బాబి,నక్కా రాజబాబు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్టీయుకెలో సెమినార్ హాలు, సిమ్యులేషన్ ల్యాబ్‌లు ప్రారంభం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో మంగళవారం యూనివర్శిటీ మరియు ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (ఐఎస్‌టి)లలో నూతనంగా ఏర్పాటుచేసిన సెమినార్ హాలు, ల్యాబ్, రూసా నిధులతో ఆధునీకరించిన ఇంజనీరింగ్ విభాగాలను, వసతి గృహాలను ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాద రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాద రాజు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో నూతనంగా నిర్మించిన సెమినార్ హాలును, ఐఎస్‌టిలోని అడ్వాన్స్‌డ్ నానో టెక్నాలజీ ల్యాబ్ & నానో మెటీరియల్స్ సిములేషన్ ల్యాబ్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా రూసా నిధులతో ఆధునీకరించిన యుసిఇకెలోని సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఈసిఈ విభాగాలను, నరేంద్ర హాస్టల్, నాగావళి హాస్టళ్లను ప్రారంభించామన్నారు. యూనివర్శిటీలో మౌలిక సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయోగశాలల నిర్మాణం, రూసా నిధులతో విభాగాలు మరియు వసతి గృహాలను ఆధునీకరించామన్నారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, రిజిస్ట్రార్ ప్రొ. ఎల్.సుమలత, డైరెక్టర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్, ఛీఫ్ ఇంజనీర్ ప్రొ. వి.శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్‌లు, వైస్ ప్రిన్సిపాల్స్, డిఇఇ (సివిల్) జి.మోహన్‌ప్రసాద్, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఇంజనీరింగ్ అధికారులు, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**- భీమా చెక్కు ను లబ్ధిదారులకు అందజేత**



**చింతూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చింతూరు వారి ఆధ్వర్యంలో నాబార్డ్ వారి ఆదేశాలు మేరకు మండలంలోని రత్నాపురం గ్రామంలో వై.వి.ఆర్. రూరల్ పబ్లిసిటీ టీం కళాబృందం వారిచే ఇంద్రజాల ప్రదర్శన జానపద గేయాలతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే సామాజిక భద్రత పథకాల గురించి, ఆర్థిక మోసాలపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. రత్నాపురం గ్రామీణకి చెందిన శ్యామల పాండురాజు ఇటీవల మృతి చెందాడు. ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం కింద ఆ కుటుంబానికి రావాల్సిన రెండు లక్షల రూపాయల చెక్కు ను బ్రాంచి మేనేజర్ బి.వినోద్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ విల్సన్, వెలుగు వివో ఏ.కళావతి, బ్యాంకు మిత్ర వై.వి.ఆర్. కళాబృందం పాల్గొన్నారు.

# చర్చి దగ్ధంపై క్లూస్ టీమ్ గాలింపు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని వద్దిపర్రు గ్రామ రేవు సెంటర్లో పాస్టర్ దాసరి మోసే నిర్వహిస్తున్న చర్చ్ ను గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేయడంతో పోలీసులు నిందితుడి గాలింపు కోసం చర్యలు ముమ్మరం చేశారు.మంగళవారం కోతపెట డియ స్పీ ఆదేశాల మేరకు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ అధ్వర్య ంలో సిబ్బంది కాకినాడ క్లూస్ టీమ్ జాగిలాలతో దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ, కోసం ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# శ్రీ సత్యదేవుని సన్నిధిలో భీష్మ ఏకాదశి పర్వదినాన భక్తుల రద్దీ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో భీష్మ ఏకాదశి మహాపర్వదినం కావడంతో శ్రీ స్వామివారి వ్రతం దర్శనార్థం, భక్తులు శ్రీ సత్యదేవుని సన్నిధికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భీష్మ ఏకాదశి సందర్భంగా వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చ కుడు ఆలయ అర్చకులు తెల్లవారుజామున ఒంటిగంటకు అంతరాలయంలో ఉన్న శ్రీ స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొల్పి తదుపరి మహాన్యాస రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీ స్వామి అమ్మవారు దర్శనభాగ్యం కల్పించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ముందురోజు రాత్రి నుంచి అధిక సంఖ్యలో శ్రీ సత్యదేవుని సన్నిధికి చేరుకున్నారు. ఏకాదశి కావడంతో తెల్లవారుజామున గంట నుండి శ్రీ స్వామివారి వ్రతం ప్రారంభించి రెండు గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రామాలయం ఎదురుగా దద్దోజనం, పులిహోర ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్, పిఅర్‌ఓ దామోర్ కృష్ణారావు పర్యవేక్షించారు.

# టౌన్ అభివృద్ధి పనులు ప్రారంభం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** పి.వి.టౌన్‌హాల్ లిటరరీ అసోసియేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను పైడా వంశీకులు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం ఉదయం ప్రారంభించారు. టౌన్ హాల్ కమిటి అధ్యక్షులు జి.ఎస్.ఎన్.మూర్తి (నానాజి) పైడా వంశీకులందరికీ స్వాగతం పలికారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ప్రత్యేక ఆంధ్రా కోసం పైడా జమిందార్ చేసిన కృషిని స్మరించుకుంటూ ఏనాడూ తలవంచని మహానుభావుడుగా కీర్తించారు. ఇదే టౌన్‌హాల్ ప్రాంగణానికి గాంధీ మహాత్ముడు వచ్చిన విషయాన్ని కూడా గుర్తు చేస్తూ స్వాతంత్ర్య సముపార్జనతో పాటు సమాజాభివృద్ధి విషయంలోను ఏనాడూ రాజీపడలేదని అన్నారు.

అధ్యక్షులు నానాజి మాట్లాడుతూ ఈ అదనపు సదుపాయాల కల్పనతో ఈ ప్రాంగణంలో జరిగే జాతీయ క్రీడా మరియు ఇతర పోటీలకు క్రీడాకారులకు అవసరమైన వసతి సమస్య పరిష్కార మైందని చెప్పారు. విద్య, వైద్య, క్రీడా ఇలా అన్ని రంగాలకు టౌన్‌హాల్ ఆతిధ్యమిస్తూ వాటి అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. అనేక సేవా కార్యక్రమాలను టౌన్‌హాల్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య మాట్లాడుతూ లిటరరీ అసోసియేషన్ 1877లో స్థాపించారని, ఆనాటి నుండి నేటి వరకు వారి ఆశయాలతో కమిటీలు బాధ్యతలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఈ నెల 25 క్లబ్ 147వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామని, ఈ సందర్భంగా క్రీడలతో పాటు క్లబ్ సభ్యులకు అనేక అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు క్లబ్‌డే ఉత్సవంలో బహుమతి ప్రదానం చేయబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టౌన్‌హాల్ కమిటి ఉపాధ్యక్షులు జి.వై.రఘునాథ్ (రఘు), సంయుక్త కార్యదర్శి వి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు (మాస్టారు), కోశాధికారి ఎం.సూర్యనారాయణ రాజు (రవిరాజు), కార్యవర్గ సభ్యులు బసవా ప్రసాద్, పి.రామచంద్రరాజు, సుసర్ల సుబ్రహ్మణ్యం, బచ్చు శేఖర్, పి.వి.వి.ఎస్.ఎన్.సతీష్, నెక్కంటి శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, బచ్చు శివప్రసాద్, కర్రి భామిరెడ్డితో పాటు వెత్సా ఆనంద్, దంగేటి ప్రసాద్, క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హమ్మయ్య..రోడ్డు వేస్తున్నారు...!



**- గోపాలపురం-సాగిపాడు రోడ్డుకు మహర్దశ**
**- రూ 2.5 కోట్లతో నిర్మాణ చేపట్టేందుకు కృషి**
**- మంగళవారం భూమిపూజ చేసిన మంత్రి వనిత**
**- రెండు వరుసల రోడ్డుకు బదులు ఒక వరుస రోడ్డు వేయడంపై ప్రజల అసంతృప్తి**

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** దాదాపు 2 దశాబ్దాల కాలం తర్వాత గోపాలపురం- సాగిపాడు రోడ్డు నిర్మాణానికి నోచుకోనుంది. గోపాలపురం నుంచి సాగిపాడు వరకు సుమారు 10కిలో మీటర్లు ఉన్న ఈ రోడ్డును 2004లో నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఎప్పుడు చూసినా మరమ్మతులు చేయడమే తప్పా కొత్తరోడ్డు వేసిన పాపాన పోలేదు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత 3సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి కానీ ఎవరూ ప్రజల గోడును పట్టించుకోలేదు. 2019లో ఇక్కడ శాసనసభ్యుడిగా ఎన్నికైన ప్రస్తుత ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈ రోడ్డు నిర్మాణానికి చాలా కృషి చేశారు. వాస్తవానికి ఈ రోడ్డును రెండు వరుసల రోడ్డుగా నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. ఏడాది క్రితమే ఆమోద ముద్ర వేసిన ప్రభుత్వం కటాయించిన నిధులకు రోడ్డు నిర్మాణం పూర్తవ్వదనే లక్ష్యంతో వచ్చిన గుత్తేదారులు వెనక్కి వెళ్లిపోయిన పరిస్థితి దీంతో ఏడాది పాట తాత్సారం జరిగిపోయింది. ఎన్నికల సమీపిస్తున్న వేళ కనీసం సింగిల్ రోడ్డయినా వేయకపోతే ఓట్లు పడే అవకాశం లేదని తలారి వెంకట్రావు, ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత కలిసి పోరాటం చేసి రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకువచ్చారు. ప్రస్తుతం సింగిల్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది.

**-రెండు వరుసల రోడ్డు అవసరం**..గోపాలపురం-సాగిపాడు రోడ్డు రెండు వరుసల రోడ్డు చాలా అవసరం...ఎందుకంటే గతంలో జనాభా తక్కువ..గ్రామాలు తక్కువ..అప్పటి పరిస్థితులకుఅనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ ఇప్పుడు ప్రజల అవసరాలు పెరిగాయి. గ్రామల సంఖ్య పెరిగింది. ప్రదిచిన్న అవసరానికి పల్లెల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వస్తున్న పరిస్థితి ఉంది. అంతకంటే ముఖ్యంగా జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం వెళ్లడానికి ఈ రోడ్డు చాలా దగ్గర తాళ్లపూడి మీదుగా పోలవరం వెళ్లాలి అంటే 25కిలో మీటర్ల దూరం వస్తుంది. ఇలా వెళితే 15కిలో మీటర్లలోనే చేరుకోవచ్చు. ఈ నేపథ్యంలో రెండు వరుసల రోడ్డు చాలా అవసరం కానీ ఎన్నికల నేపథ్యంలో నేతల స్వలాభం కోసం హడావుడిగా రోడ్డు నిర్మాణం చేసేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2.5కోట్ల నిధులు.. మంత్రి వనిత శంఖుస్థాపన దాదాపు 10కిలో మీటర్ల మేర గోపాలపురం-సాగిపాడు రోడ్డు నిర్మాణానికి రూ.2.5కోట్లు నిధులు మంజూరైనట్లు మంత్రి తానేటి వనిత తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులతో కలిసి శంఖుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఈరోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఎట్టకేలకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ..ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చెయ్యడానికి 6నెలల గడువు ఉన్నప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సకాలంలో పనులు పూర్తి చెయ్యాలని గుత్తేదారుని కోరినట్లు తెలిపారు.

# భీమోలులో అక్కదేవతలను దర్శించుకున్న హోంమంత్రి తానేటి వనిత



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండలం భీమోలులో అక్క దేవతల అమ్మవార్లను రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత దర్శించుకున్నారు. మంగళవారం అక్క దేవతల తీర్థ మహోత్సవాల సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన కాసేపు తిలకించారు. అక్కదేవతల దయతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవనం గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**-అక్కదేవతలను దర్శించుకున్న మద్దిపాటి..** తెలుగుదేశం పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు భీమోలులోని అక్కదేవతల ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు.ఈ ప్రాంతంలో అక్కదేవతల తీర్థ మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయానికి వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ ఎంతో చరిత్ర కలిగిన అక్కదేవతల ఉత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందమని చెప్పారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచి, తెలుగుదేశం నాయకులు గండ్రోతు శ్రీనివాసరావు, రాము, తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

**-దర్శించుకున్న సువర్ణరాజు ..**మండలంలోని భీమోలులోని మంగళవారం జరిగిన అక్కదేవతల ఉత్సవాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనతో పాటు గ్రామ అధ్యక్షుడు గండ్రోతు ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ భర్త కోడి దేవీప్రసాద్, మధ్యాహ్నపు రాంపండు, వేగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన భక్తాంజనేయ స్వామి వారి ఏకాహ మహోత్సవాలు

**- పటిక బెల్లం తులాభారం కొరకు పోటెత్తిన భక్తులు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం నల్లాకులవారిపాలెం గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఏకాహ మహోత్సవాలు ఫిబ్రవరి 20వ తేదీ మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి . జాతీయ రహదారి ప్రక్కనఉన్ననల్లకులవారిపాలెం గ్రామంలో భక్తాంజనేయ స్వామి వారి ఆలయం నిర్మించి 51 సంవత్సరాలు పూర్తికావడంతో ఈ ఏడాది అంగరంగ వైభవంగా స్వామివారి 51 వవార్షికోత్సవమహోత్సవాలను నిర్వహించడానికి గ్రామస్తులు ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల జరిగే ఐదు రోజులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయి తొలి రోజు స్వామివారిని పరిసర గ్రామాల ప్రజలతో పాటు ప్రముఖులు చాలామంది దర్శించుకున్నారు. నిడదవోలు నియోజకవర్గం సీనియర్ తెదేపా నాయకులుకుందుల వీర వెంకట సత్యనారాయణ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తణుకు బ్రాంచ్ మేనేజర్ కే ఎస్ రాజశేఖర్ ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పలువురు అధికార అనధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. కూరగాయలు వర్తక సంఘం భక్తాంజనేయ స్వామి ఉత్సవ కమిటీ సంయుక్త సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ్ కమిటీ సభ్యులు నల్లాకులవారిపాలెం గ్రామ సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు (కోటా శ్రీను) తెలియజేశారు.

స్వామి వారి 51వ వార్షికోత్సవ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం చలువపందిర్లు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకునే దూరప్రాంత భక్తులకు భోజన సదుపాయం ఉత్సవాలు జరిగే జరిగే ఐదు రోజులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు.


**ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్**

Regd No. ABC-CS/006/2015

**(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)**

**పబ్లిక్ నోటీసు**

ఈ ప్రకటనలోనివారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్థి పై సొసైటీ నందు తనఖా పెట్టి సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపుగా లిఖితపూర్వకంగా అభ్యంతరములను అక్నాలెడ్జ్‌మెంట్‌తో రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా బ్యాంకుకు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

| వ.నెం. | పేరు | స్థిరాస్థి వివరములు |
|---|---|---|
| 1. | Sri. Jogavarjula Veera Venkata Surya Bhaskara Kameswara Sastry<br>S/o Sambanna Sastry<br>GL No : 27661<br>D.No : 3-8, Main road, Pedapalla, Alamuru (M), Konaseema Dist - 533232.<br>Ph No : 9676272964/ 9032948399. | An extent of 289 sq.yds or 241.647 Sq.mtrs vide doc. No : 2862/2023 of house site with Tiled Roof Ground Floor building situated at Pedapalla Vide R.S.No : 135, Assisment No : 617, Block No : 2.<br>D.No : 3-8, Main road, Pedapalla, Alamuru (M), Konaseema Dist - 533232.<br>Value of Rs.16.37 Lakhs. |
| 2. | Sri. Chittapragada Veera Venkata Satyanarayana<br>S/o Dhamodhara Rao<br>GL No : 82306<br>Old D.No : 1-12, New D.No : 1-15, Sivalayam Street, Gopavaram, Uppalaguptam (M), Konaseema Dist - 533213.<br>Ph. No : 9989483993. | An extent of 221 sq.yds vide doc.No's : 2667/1993 & 3415/1993 of house site with RCC Roof Ground Floor building situated at Gopavaram Vide R.S.No : 187/14, Assisment No : 12.<br>Old D.No : 1-12, New D.No : 1-15, Sivalayam Street, Gopavaram, Uppalaguptam (M), Konaseema Dist - 533213.<br>Value of Rs.22.12 Lakhs. |

Kakinada
19.02.2024

**Branch Manager**
P.S.N.M.Srikanth
Cell : 9281029464/9885547599

## గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



**– ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం**

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో 2024– 25 సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని రాజవొమ్మంగి ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలోనాలుగవ తరగతిచదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 జూన్ 1 నుండి 2015 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఓసి బిసి కులాలకు చెందిన విద్యార్థులు 2013 జూన్ 1 నుండి 2015 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఒక లక్ష మించి ఉండరాదని ఏపీ టీ డబ్ల్యూ గురుకులం డాట్ ఏపీ డాట్ గవర్నమెంట్ డాట్ఇన్ వెబ్ సైట్ ద్వారాఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఈ ప్రకటన ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

## భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి సన్నిధిలో మాఘమాసం భీష్మ ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా శ్రీ స్వామివారి గ్రామోత్సవం గరుశుమంతుడు వాహనం సర్వసుందరంగా వివిధ రకముల పుష్పాలతో అలంకరించి శ్రీ స్వామి అమ్మవార్లను ఆసీన్లు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవ కార్యక్రమంలో పండితులు, అర్చకులు, దేవస్థానం దామోరా కృష్ణారావు, పిఆర్ఓ విభాగం గణపతి, సూపర్డెంట్ స్వామీజీ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో సైద్ధాంతిక విమర్శలు తప్ప వ్యక్తిగత దూషణలు ఉండకూడదు

**– ఎమ్మెల్యే అయిన తొలి ఏడాదే మహిళలముందు వ్యక్తిగత దూషణలు చేసిన ద్వారంపూడి**

**– వ్యక్తిగత దూషణలను పరాకాష్టకి తీసుకెళ్తున్న పలువురు నేతలు**

**– కొన్ని సామాజికవర్గాలని దూషించడాన్ని జనసేనపార్టీ తీవ్రంగా ఖండిస్తోంది**

**– జనసేన సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాజకీయాల్లో సైద్ధాంతిక విమర్శలు తప్ప వ్యక్తిగత దూషణలు ఉండకూడదని, కానీ కొంతమంది వైకాపా నేతలు వ్యక్తిగత దూషణలను పరాకాష్టకి తీసుకెళ్తున్నారని పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ మండిపడ్డారు. కొన్ని సామాజికవర్గాలని దూషించడాన్ని జనసేనపార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మంగళవారం కాకినాడ సిటిలో జనసేనపార్టీ కార్యాలయంలో పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ ఆధ్వర్యంలో పత్రికావిలేఖరుల సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ముత్తా శశిధర్ మాట్లాడుతూ గత 20 రోజులుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభలు నిర్వహిస్తూ సిద్ధం సిద్ధం అని అరచి గీ పెడుతున్నారనీ మొత్తం పోస్టర్లతో నింపేస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా కాకినాడ సిటిలో కూడా పోస్టర్లతో నింపేస్త వారియొక్క ధనబలాన్ని చూపిస్తున్నారన్నారు. నిన్న కూడా ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వ్యక్తి గతంగా ఏపూజలు చేసుకున్నా అది వారి మతానికి సంబంధించిన వారి వ్యక్తిగత విషయమని దానిగురించి గొప్పగా చెప్పుకున్నా తక్కువగా చెప్పుకున్నా మేము పట్టించుకోమనీ కానీ ఆయన దానిద్వారా మరికొంతమందిని, కొన్ని సామాజికవర్గాలని దూషించడాన్ని జనసేనపార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇది సిద్ధం కార్యక్రమానికి కొనసాగింపుగా తాము భావిస్తున్నామన్నారు. వాళ్ళు భీంలీ సభ, దెందులూరు సభ నిన్న రాప్తాడు సభలు నిర్వహించి ఆయన చాలా గొప్పలు చెపుతుంటే, నిన్న వారి సోషల్ మీడియా పోస్టులలో ఒక చిత్రమైన పదాలని వాడారనీ అదేమిటంటే భీంలీల్లో భయపెట్టాం, దెందులూరులో దడపుట్టించాం, అనంతపూర్లో అల్లాడిస్తాం అని, ఇది కాకినాడ నుంచీ జనసైనికుమీద వాళ్ళు పెట్టిన పోస్టర్ అని, దీనినిబట్టి ఈ వై.సి.పి. వాళ్ళ దృష్టిలో సిద్ధం అంటే ప్రజల మీద దండయాత్రకి సిద్ధము అని అర్థమవుతోందన్నారు. ప్రజల యొక్క మాన, ప్రాణ ఆస్థులని దౌర్జన్యంగా భంగపరుస్తాము దానికి మేము సిద్ధం అని చెపుతున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కాకినాడలో చూస్తే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తాను ఎం.ఎల్.ఏ అయ్యాకా మొదటిసంవత్సరమే మహిళలముందు తన అహంకారాన్ని ఒక పబ్లిక్ మీటింగులో వ్యక్తిగత దూషణకు తీసుకెళ్ళారనీ అది అలా కంటిన్యూ చేసుకుపోతున్నారనీ రాష్ట్రంలో అక్కడ కొడాలి నానీ, రోజా ఎవరికివాళ్ళు వ్యక్తిగత ధూషణలని పరాకాష్టకి తీసుకెళ్ళిపోయారనీ కాకినాడలో కూడా వారుతీసుకెళ్ళుతున్న తీరుని తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. రాజకీయాల్లో సైద్ధాంతిక విమర్శలు తప్ప వ్యక్తిగత దూషణలు ఉండకూడదన్నారు.

వారుచేసే తప్పులని ప్రతిపక్షంగా విమర్శిస్తామనీ అదిలేకుండా కాకినాడలో చేసారన్నారు. వై.సి.పి వాళ్ళు సిద్ధం అంటున్న దానికి ప్రతిస్పందనగా తాము గత 15 రోజులుగా మేము సిద్ధం అనే కార్యక్రమాన్ని చేస్తున్నామనీ అది అందరికీ తెలుసనీ పత్రికా విలేఖరుల సమక్షంలో మరియు ప్రజల మధ్యలో చెపుతున్నాము ప్రతిచోటా వై.సి.పి. వాళ్ళ దౌర్జన్యాలని, వాళ్ళ అహంకార చర్యలని ప్రశ్నిస్తూ జనసైనికులు వాటిపై పోరాడుతామని చెపుతున్నామన్నారు. జనసేనపార్టీగా ఏవ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని కానీ, మతాన్ని కానీ, సామాజిక వర్గాన్ని కానీ గౌరవించని వాళ్ళని మేము ఖండిస్తామనీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఒకటే చెపుతున్నారనీ బూతులు మాట్లాడుతున్న ప్రజాప్రతినిధుల సంగతి ప్రజలు బూత్ లలోకి వెళ్ళి చెప్పాలని అన్నారనీ, ఈమాటని కాకినాడ ప్రజలు అందరూ రానున్న రోజుల్లో బూతులకి ముగింపు పలుకుతారనీ మాన మర్యాదలని గౌరవించుకునే వారిని జనసేనపార్టీని గెలిపించుకుంటారన్నారు. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాం ఈ అరవై రోజులలో మీరు రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వండి తప్పులేదు, వ్యక్తిగత ధూషణలు ఆపండి ఎవరెవరు ఎంత తిన్నారో ప్రజలు అంతా చూస్తున్నారనీ సమకాలీన రాజకీయ నాయకుడిగా తాను హితవు పలుకుతున్నానన్నారు.

ఈ సమావేశంలో జిల్లా సమ్యుక్త కార్యదర్శి బడే క్రిష్ణ, సిటి ఉపాధ్యక్షులు అడబాల సత్యన్నారాయణ, ఓలేటి రాము, సిటి కార్యదర్శి వాడ్రేవు లోవరాజు, సుమంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దు విజయ్ కుమార్, కె. ఆదినారాయణ, దాసరిసత్తిరాజు,సతీష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు జింకల తరలింపు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బొమా టెక్నిక్ ద్వారా 37 జింకలను తొలి విడతగా కాప్చర్ చేసి నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌నకు తరలించడం జరిగిందని కోరింగ వన్యప్రాణి విభాగము అటవీక్షేత్రాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కాకినాడ పట్టణం సమీపమున ఉన్న నాగార్జున సాగర్ ఫెర్టిలైజర్ & కెమికల్స్ ఫ్యాక్టరీ గ్రీనిబెల్ట్ పార్క్‌లో సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా వారి అనుమతితో కొనసాగిస్తున్న జూ పార్కులో సుమారు 200 జింకలు ఉన్నవి. ఫ్యాక్టరీ నిర్వాహణ మరియు నిధుల లేమి కారణంతో సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా (సిజెడ్ఎ) వారి అనుమతి రద్దయిన కారణంగా ప్రస్తుతము ఆవాసము ఉన్న 200 జింకలను నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ నకు తరలించవలసిన ఆవశ్యకత జిల్లా అటవీశాఖ అధికారులకు ఏర్పడినదన్నారు. చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వులను అనుసరించి ఈ తరలింపు కార్యక్రమములో భాగంగా జిల్లా అటవీశాఖాధికారిణి ఎస్.భరణి ఆధ్వర్యములో నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ పశు వైద్యులు అరుణ్ వెస్లీ తోబాటు శ్రీ వెంకటేశ్వర జూ పార్క్, తిరుపతి మరియు ఇందిరా ప్రియదర్శిని జూ పార్కు విశాఖపట్నం పశువైద్య బృందం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన బొమా టెక్నిక్ ద్వారా చేపట్టడం జరిగినదన్నారు. ఈ బొమా టెక్నిక్ ను ఉపయోగించి వన్యప్రాణులను క్యాప్చర్ చేసి ట్రాన్స్‌లొకేషన్ ఆపరేషన్ ద్వారా వన్యప్రాణులపై ఏ విధమైన ఒత్తిడి లేకుండా మృదువుగా రెస్క్యూ చేసి తరలించే ప్రక్రియ అని తెలిపారు. దక్షిణ భారతదేశములో మొట్టమొదటిసారిగా ఈ పక్రియను ఉపయోగించి తొలి విడతలో భాగంగా 37 జింకలను ఈ నెల 16వ తేదీన క్యాప్చర్ చేసి 17వ తేదీన నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌నకు తరలించి మృదువైన ఎన్‌క్లోజర్ ద్వారా 100% సురక్షితముగా టైగర్ రిజర్వ్ లోనికి విడిచిపెట్టడం జరిగినదని కోరింగ వన్యప్రాణి విభాగము అటవీక్షేత్రాధికారి తెలిపారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**– ఎంపీపీ శేషగిరిరావు**



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామాల్లో సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలందరికి త్రాగు నీరు ఎద్దడి లేకుండా చూడాలని, త్రాగునీరు సమస్య ఎక్కడైనా ఉంటే త్వరితగతిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలన్నారు. రాబోయే వేసవి కాలంలో త్రాగునీరు సమస్య ఎక్కడ ఉందో గుర్తించి కుళాయిలు ద్వారా నీరు రాని చోట ట్యాంక్ లు ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. వరి పంట రైతులకు వంతులు వారి అందిచ్చేటప్పుడు తూము పాడైనచోట గుర్తించి తలుపులు మరమ్మతులు చేయించాలని చెప్పారు. శాఖలు వారీగా ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు గురించి అధికారులు వివరించారు. 4,300 ఎకరాలు వరి సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వి. సత్యనారాయణ చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల పురుగులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్వామి మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ లు మంజూరు అయ్యాయని చెప్పారు. డ్రైన్ శాఖ ఏఈ సునీత మాట్లాడుతూ డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్నాయని త్వరలో క్రాస్ బండ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంపీడీఓ కృష్ణ మోహన్ మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో త్రాగునీరుకు అధికారులు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అవసరం అయితే గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను ఉపయోగించుకోవాలని ఏఈ స్వామికి సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొనుకు గౌతమీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఏఎంసి చైర్మన్ డోలామణి, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## సిద్దు ఆరోగ్యానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జగతా సిద్దు వైద్య ఖర్చుల నిమిత్తం పూర్వ విద్యార్థులు 21500 రూపాయలు ఆర్థిక సాయం గా అందించారు. జగంపేట మండలం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన జగతా దుర్గాప్రసాద్ కుమారుడు సిద్దుకు బ్రెయిన్‌లో నరాలకు నీరు పట్టడం జరిగింది. తల్లిదండ్రులు హైదరాబాద్ వరకు ఆసుపత్రులను ఆశ్రయించారు. ఫలితం లేకపోవడంతో బెంగళూరు ఆసుపత్రిలో చూపించగా పరీక్షలలో మెదడుకు సంబంధించిన చిన్న నరంకు నీరు పట్టిందని వారం రోజులపాటు ఆసుపత్రిలో ఉంచాలని తెలిపారు. వైద్య నిమిత్తం ఎనిమిది లక్షలు దాటి ఖర్చవుతుంది అన్నారు. సాధారణ కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాట్రావులపల్లి గ్రామానికి చెందిన ముసిరెడ్డి నాగేశ్వరరావు అనే యువకుడు వాట్సాప్ ఫేస్బుక్లలో సహాయం కోసం అర్థించారు. తనకు పరిచయమున్న ప్రతి ఒక్కరిని ఆర్థికంగా ఆ కుర్రాడు ఆరోగ్యం గురించి సాయం చేయమని కోరాడు. ఫలితంగా సుమారు మూడు లక్షలు దాటి దాతల సహాయం అందింది. సోషల్ మీడియాలో బాబు గురించి తెలుసుకున్న జగ్గంపేట ఉన్నత పాఠశాల 1974–75పూర్వ విద్యార్థులు కొద్దిపాటి సాయాన్ని అందించడం జరిగింది. గ్రామ సర్పంచ్ సీతారామయ్య, ఉపసర్పంచ్ ముసిరెడ్డి నాగేశ్వరరావు ఇతర పెద్దల ఆధ్వర్యంలో 21,500 రూపాయలను సిద్దు తండ్రికి అందించారు. పూర్వ విద్యార్థులు స్థానిక టిడిపి నాయకులు కుంచె సీతారామయ్య( తాతాజీ ) జర్నలిస్ట్ అడపా వెంకట్రావు, రిటైర్డ్ హెచ్ఎం కే ఉదయ భాస్కర్, రిటైర్డ్ ఆర్ ఐ నీలి లోవ ప్రకాష్, ఎస్ వి వి అప్పారావు, మానేపల్లి వీరేశ్వర రావు చేతులు మీదుగా ఈ సొమ్మును అందించారు. ముఖ్యఅతిథిగా వచ్చినసర్పంచ్ సీతారామయ్య స్పందించి తన ఆర్థిక సాయంగా అయిదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన సిద్దు ఆరోగ్యానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా 5 లక్షల వరకు ఒక వారం రోజుల్లో ఆ బాలునికి సమకూర్చవలసి ఉంటుందన్నారు. దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# 'ఆదిత్యుని' కళ్యాణ వైభోగమే..

**– ఉషా, పద్మిని, ఛాయా, సౌజ్ఞలను పెళ్ళాడిన సూర్యదేవుడు**

**– సూర్య నామస్మరణతో పులకించిన జి.మామిడాడ**



**పెదపూడి, మేజర్ న్యూస్ :** భారతదేశంలోనే శ్రీవైష్ణవ సాంప్రదాయరీత్యా పూజలు అందుకుంటున్న ఏకైక సూర్య దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన పెదపూడిమండలం గొల్లలమామిడాడలోని సూర్యదేవాలయంలో ఆదిత్యుడి కళ్యాణం కనులపండువగా జరిగింది. భీష్మ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీఉషా, పద్మిని, ఛామా, సౌంజ్ఞ నమేత శ్రీసూర్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. తెల్లవారు జామున తీర్థపు బిందెతో స్వామి ఆలయప్రవేశం చేసిన తర్వాత మేలుకొలుపు సేవతొ మొదలై సప్తనదీజలాభిషేకము, పంచామృతాభిషేకము, నిత్యార్చన, మంగళశాసనము(హరతి), అనంతరం భక్తులకు దర్శనం. గ్రామంలో గల పవిత్ర తుల్యనధిలొ స్నానం ఆచరించి భక్తులు ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం 8గం.కు ధ్వజారోహణం, విశేషహోమంలు, ఐశ్వర్యసిద్ధికి, మోక్షసిద్ధికి, సకల కార్య సిద్ధికి శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి జరిపించబడ్డాయి. అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు , మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, జనసేన నియోజకవర్గం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి, చింతాదొరబాబు, వైస్ ఎంపీపీ ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతపండు), ఛాంబర్ అధ్యక్షులు ద్వారంపూడి వెంకటరెడ్డి(కోళ్ళఫారం) ఆలయకమిటి చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసబాలకృష్ణారెడ్డిలు స్వామిని ధర్శించుకున్నారు. వీరికి ఆలయమర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1 గం.కు బ్యాండుమేళాలు, నృత్యగీతాది మంగళవాయిధ్యాలు, కోలాటములు, తీన్మార్ వాయిధ్యములు, బారీ బాణానంచాకాల్పుల నడుమ ఉషా, పద్మిని, ఛాయా, సౌజ్ఞలతో సూర్యదేవుడు గ్రామంలో రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరశింహాచార్యులు(పెదబాబు) మాట్లాడుతూ స్వామిని ధర్శించుకుని కోరిన కోరికలు సంవత్సరం లోపునే నెరవేరిన నిదర్శనాలు కొకొల్లలుగా ఉన్నాయని రోజురోజుకి స్వామి మహిమలుతెలుసుకుంటున్న భక్తులు దేశ, విదేశాల నుండి వచ్చి ఇక్కడ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని తెలిపారు. 7 ఆదివారములు 7 ప్రదక్షిణలు చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ధివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి, తమిళనాడు గవర్నర్ గా పనిచేసిన కె రోషయ్య, షర్మిల, ఎందరో మంత్రులు, రాజకీయ సినీ ప్రముఖులు ఇక్కడ పూజలు జరిపించుకున్నారని వివరించారు. స్వామిని ధర్శించిన కోరిన కోరికలు నెరవేరడం ఖాయమని ఆయన తెలిపారు. రాత్రి 7 గం.లకు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళశాసనములతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొవ్వూరి శ్రీనివాన బాలకృష్ణారెడ్డి, కార్యనిర్వాహణాధికారి మోర్తమురళీవీరభద్రరావు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించగా ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటన రశింహచార్యులు ఆధ్వర్యంలో 20 మంది వేదపండితులు వైష్ణవ సాంప్రదాయరీత్యా స్వామి వారి కళ్యాణక్రతువును శాస్త్రయుక్తంగా జరిపించారు. అనంతరం పంచరంగుల విధ్యుత్ దీపాలంకరణలతో కూడిన శ్రీవారి గజవాహనం ఎదురుగా పయనించుచుండగా మరియెక ప్రక్క రంగు రంగుల బాణాసంచా కాల్పుల మధ్య నృత్యగీతాది మంగళవాయిధ్యములతో శ్రీకళ్యాణ స్వామి దేవేరులతో కూడిన గరుడ వాహనంపై గ్రామపురవీదులలో జరిపిన ఉత్సవ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వామి కళ్యాణతలంబ్రాల కోసం భక్తులు ఎగబడ్డారు. బాణాసంచా కాల్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీనేతలు ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతపండు ), మేడపాటి అమ్మిరెడ్డి, పప్పుచిన్నారెడ్డి, డి.బంగార్రెడ్డి, కర్రిరామకృష్ణారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి లు తీర్ధ ప్రసాదాలను బోజన, వసతి సౌకర్యలను ఏర్పాటు చేసారు. స్థానిక మార్కెట్ వర్తకసంఘం వారిచే భారీ అన్న సమారాధన నిర్వహించబడింది. ఉత్సవాలలో ఎటువంటి అవాంచనీయసంఘటనలు జరగకుండా కాకినాడ డిఎస్పీ హనుమంతరావు, కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదపూడి ఎస్ఐ శోభన్ కుమార్ 40 మంది ఎస్ఐలు, ఎఎస్ఐలు,పోలీసు సిబ్బంది దగ్గరుండి ఉత్సవాలను పర్యవేక్షించారు.

## టీబీ ముక్త పంచాయతీలుగా కానూరు అగ్రహారం కోరుపల్లి పంచాయతీలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కోరుపల్లి, కానూరు అగ్రహారం గ్రామములలో ఫిబ్రవరి 20వ తేదీ మంగళవారం టీబి ముక్త పంచాయతీ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమ మునకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, రాజమహేంద్రవరం నుండి డాక్టర్ ఎన్. వసుంధర (జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారిని)మరియు డాక్టర్ దీప్తి వారి టీం వచ్చి టీవీ ముక్త పంచాయతీ గా సెలెక్ట్ అయినందుకు కోరుపల్లి, కానూరు అగ్రహారం గ్రామ వైద్య సిబ్బందికి, సెక్రటరీ, ప్రెసిడెంట్ లను సత్కరించి అభినందించారు టీవీ వ్యాధి నివారణకు అన్ని గ్రామాలు కృషి చెయ్యాలని వారి కోరారు, ఏఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బందికి ప్రజలకు అవగాహన కల్పించి నివారణకు తోడ్పాడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కోరుపల్లి, కానూరు అగ్రహారం వైద్య సిబ్బంది మరియు కానూరు పిఎస్సి వైద్యాధికారి డాక్టర్ కె. హేమరాజు, కానూరు అగ్రహారం గ్రామ సర్పంచ్ దాసం వెంకన్న కోరుపల్లి గ్రామ సర్పంచ్ ఇతర సిబ్బంది సూపెర్వైజర్స్ పాల్గొన్నారు.

## తల్లి పిల్లలకు అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పటల్‌లో అందుబాటులో

**– అత్యాధునిక వైద్య సదుపాయాలతో లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పటల్ ప్రారంభించిన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత**



**రామహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తల్లి పిల్లలకు అన్ని రకాల వ్యాధులకు వైద్య సదుపాయం అందుబాటులో ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్‌లో లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పటల్ ను హోం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు అందుబాటులో తల్లి, బిడ్డలకు అన్ని రకాల వ్యాధులకు ఒకే చోట చికిత్స లభించేలా లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పటల్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ మెట్రో సిటీస్ లో ఉండే అత్యాధునికమైన సౌకర్యాలతో రాజమహేంద్రవరంలో లిటిల్ స్టార్ అండ్ షీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే విధంగా హాస్పటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న రాజమహేంద్రవరంలో 120 పడకలతో అత్యాధునిక సౌకర్యాలతో లిటిల్ స్టార్స్ అండ్ షీ ఆసుపత్రిని ప్రారంభించినట్లు ఆసుపత్రి సిఇవో డాక్టర్ రమేష్ గంటా, డాక్టర్ ఎస్ రాజారామ్‌లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎంఎల్సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పిల్లల వైద్యం, మహిళల వైద్యంలో ఇక్కడ అందుబాటులో లేని సర్వీసులను అంబాటులోకి తెచ్చామన్నారు. హైదరాబాద్, బెంగుళూర్ వంటి పెద్దపెద్ద నగరాలకే పరిమితమయ్యే అత్యాధునిక క్రిటికెల్ కేర్ వైద్య వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. డెలివరీ సమయంలో వచ్చే క్లిష్ట పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కనేందుకు అవసరమైన వైద్య బృందం సిద్దంగా ఉందన్నారు. హైరిస్క్ ఉన్న డెలివరీలను చేయడానికి సైతం అన్ని విధాల సిద్దంగా ఉన్నామని పేర్కొన్నారు. డెలివరీ అయ్యాక పిల్లలకు ఆరోగ్యం సరిగ్గా లేకపోతే తక్షణమే అందించాల్సిన వైద్య సౌకర్యాలతో పాటు, ఐదో నెలలో బిడ్డ జన్మించినా అలాంటి వారికి అందించాల్సిన వైద్యం సిద్దంగా ఉందన్నారు. పిల్లలో డెంగ్యూ ముదిరితే వైద్యం కోసం పెద్ద నగరాలకు పరుగులు తీయకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందించే విధంగా వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఏ ఆసుపత్రిలో అయినా ప్రసవం క్లిష్టమైన పరిస్థితుల్లో తమ ఆసుపత్రిని సంప్రదిస్తూ తమ వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు. జన్యుపరమైన సమస్యల కోసం దేశంలో ప్రఖ్యాతి చెందిన వైద్యులతో టెలి మెడిసిన్ సౌకర్యం కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. అందరికి అందుబాటులోనే వైద్య సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. తమ ఆసుపత్రి వచ్చే మూడేళ్ళలో అబ్‌స్టెట్రిక్స్, గైనిక్, పిడియాట్రిక్, నియోనాటల్ విభాగాల్లో పిజి విద్యను అందించే స్థాయికి ఎదుగనుందని, అలాగే ఈ విభాగాల్లో పిజి పూర్తి అయిన వారు సూపర్ స్పెషాలిటీ విద్యను అభ్యసించే విధంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ గంటా రూప, డాక్టర్ శ్రీనయన, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ శ్రీహర్షలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జాగృతి అధినేత డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ టివి నారాయణరావు, డాక్టర్ సివిఆర్ శాస్త్రి, డాక్టర్ బలభద్ర వెంకటరాజు, డాక్టర్ కర్రి రామారెడ్డి, నగర ప్రముఖులు చెరుకూరి కృష్ణాజీ, బుడ్డిగ శ్రీనివాస్, బర్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐటి అప్లికేషన్స్ నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** శిక్షణలో ఇచ్చిన అన్ని అంశాలను క్షుణ్ణంగా నేర్చుకొని వాటిని ఎన్నికల విధులు నిర్వహణలో సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో 2024 అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కు ఐటి అప్లికేషన్స్ నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో ఈ.ఎస్.ఎం.ఎస్. ద్వారా మాత్రమే రిపోర్టులు, నివేదికలు పంపించాలని సూచించారు. గతంలో రిపోర్టులు మాన్యువల్‌గా పంపించేవారని ప్రస్తుతం మాన్యువల్‌గా ఆదేశాలు ఇవ్వడం గానీ రిపోర్టులు పంపించడం గాని అన్ని ఈ.ఎస్.ఎం.ఎస్. ద్వారానే జరుగుతాయని, ఈ.ఎస్.ఎం.ఎస్. నిర్వహణ ప్రతిఒక్కరూ సక్రమంగా నిర్వహించడం నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఎన్నికల అధికారికి ఈ.ఎస్.ఎం.ఎస్. నిర్వహణకు ఒక లాగిన్ ఇవ్వడం జరుగుతుందని ఆ లాగిన్ ద్వారానే ఆదేశాలు వస్తాయని, నివేదికలు కూడా పంపించ వలసి ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఈ.ఎస్.ఎం.ఎస్. మొబైల్ యాప్ అని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా దీనిని డౌన్లోడ్ చేసుకుని అధికారి హోదా, మొబైల్ నెంబర్ తదితర వివరాలను నమోదు చేసి లాగిన్ ను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఎవరైనా ఈ.ఎస్.ఎం.ఎస్. ను దుర్వినియోగం చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి, కాకినాడ డీఎల్‌డివో నారాయణమూర్తి, ఐటీ నోడల్ అధికారులు యన్ఐ సిడిఐఓ సుబ్బారావు, పెద్దాపురం డిఎల్‌డిఓ ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్‌లు, తాసిల్దార్‌లు, వివిధ కార్యాలయాల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య

తూర్పుగోదావరి

బుధవారం

21 ఫిబ్రవరి 2024







# అదిగో పులి...ఇదిగో పులి...!

**– బందపురం, దొండపూడి ప్రాంతాల్లో పులికాలి ముద్రలు**

**గోపాలపురం,మేజర్‌న్యూస్ :** గోపాలపురం మండలం దొండపూడి, దేవరపల్లి మండలం బందపురం గ్రామాల్లో పులి సంచారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బందపురం పరిసర ప్రాంతాల్లో పొగాకు, జీడిమామిడి తోటల్లో పులిపాదముద్రలు ఉండడంతో రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దొండపూడిలోని నర్సరీ ప్రాంతంలో పులి సంచారాన్ని స్థానికులు గుర్తించారు. నర్సరీలో పని నిమిత్తం వెళ్లినకూలీలు పాదముద్రలు చూసి భయాందోళనకు ఇళ్లకు పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులు పులిజాడలను బట్టి ప్రయత్నం చేస్తున్నారు.



# నిందుతులను కఠినంగా శిక్షించాలి

**– రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానందం**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** చర్చి దగ్ధం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని టీడీపీ ఉపాధ్యకులు, కొత్తపేట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి టీడీపీ శ్రేణులతో కలసి మంగళవారం పరిశీలించి పాస్టర్‌ని ఓదార్చి, ఆర్థిక సహాయం అందించారు. ఇటువంటి చర్యలు సమాజ శ్రేయస్సుకు మంచిది కాదని, దుండగులు ఎంతటివారైనా చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్ మోసేకు, సంఘసభ్యులకు అన్ని విధాలుగా అండగా వుంటామని సత్యానందరావు హామీ ఇచ్చారు. జుజ్జవరపు హరిబాబు, వాకలపూడి సూరిబాబు లతో పాటు నియోజకవర్గ, మండల పాస్టర్లు, వద్దిపర్రు గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిల్లెట్స్‌ను ప్రోత్సహిస్తున్న ట్రూ గుడ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం

**– విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతి ప్రధానం**
**– రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సంపూర్ణ పోషక విలువలతో నాణ్యమైన మిల్లెట్స్‌తో కూడిన ఆహారాన్ని అందిస్తోంది**
**– మంత్రి వేణు గోపాల్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** విద్యార్థుల్లో కళాత్మక ప్రతిభను పాఠశాల స్థాయి నుంచే గుర్తించి ప్రోత్సహించే ఒక బృహత్తర కార్యాచరణతో మిల్లెట్ ధాన్యానికి ఛాంపియన్‌గా ఉన్న ట్రూ గుడ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమా టోగ్రాఫి శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మిల్లెట్ ఆహార పదార్థాల "స్నాక్ బ్రాండ్" లోగో పోటీ విజేతలకు ట్రూ గుడ్ సంస్థ అందిస్తున్న బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి వేణుగోపాలకృష్ణ ట్రూ గుడ్ సంస్థ ఎండి రాజు భూపతి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ .. ట్రూ గ్రూప్ సంస్థ నిర్వహించిన మిల్లెట్ స్నాక్ బ్రాండ్ లోగో పోటలలో విజేతలైన విద్యార్థులను సత్కరించి బహుమతులు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఉభయ రాష్ట్రాలలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన నలుగురికి ఒక్కొక్క ట్యాబ్ లు, స్మార్ట్‌వాచ్‌లు మరియు ల్యాప్ టాప్‌లను బహుమతు లుగా అందించగా, ఈ పోటీలలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను ప్రోత్సాహం అందించే క్రమంలో మెరిట్ సర్టిఫికేట్‌లను అందిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి బిడ్డ వారు మానసిక పరిపక్వతతో సంపూర్ణ స్థాయి ఆరోగ్యంగా ఉండేందుకు గాను మంచి పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆర్థిక స్తోమత లేని తల్లితండ్రుల పిల్లలు ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న వారి ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న గోరుముద్ద, జగనన్న సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా ఆహారాన్ని అందించడం జరుగుతోందని అన్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వలన పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం పెరిగి వారి మానసిక పరిపక్వత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మిల్లెట్ చిరుధాన్యాలతో తయారు చేసిన పోషక విలువలతో కూడిన నాణ్యమైన చిక్కిలను విద్యార్థి దశలో ఉన్న పిల్లలు తప్పనిసరిగా ఆహారంగా తీసుకోవాలన్నారు. సమాజ నిర్మాణానికి బాల బాలికలు పిల్లర్లు వంటి వారిని, బాలబాలికలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలనీ మంత్రి పేర్కొన్నారు. మన పిల్లలు ఎక్కడికి వెళ్లినా రాణించి వారీ ప్రత్యేకతను చాటుకునే విధంగా ప్రాథమిక విద్య నుండి ఇంగ్లీష్ మీడియం, ఐబి, బైజూస్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసి సీఎం జగన్మోహన్ రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన విద్య ద్వారానే సాధ్యమవు తుందని నమ్మి అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. స్వాతంత్ర్యానంతరం దీర్ఘకాలికంగా జరగని కుల గణన కార్యక్రమాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి గారిని అడిగిన వెంటనే అమలు చేసి 15 రోజుల్లో సర్వే పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నారని మంత్రి స్పష్టం చేశారు.



ట్రూ గుడ్ సంస్థ ఎండి రాజు భూపతి మాట్లాడుతూ ట్రూ గుడ్ యొక్క ఆర్ట్ కాంపిటీషన్ బ్రాండ్ యొక్క వార్షిక కళ పోటీ యొక్క మొదటి ఎడిషన్‌లో 5000 మందికి పైగా పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. బహుళ రిటైల్ మరియు సంస్థాగత మార్గాల ద్వారా నెలకు 6 కోట్లకు పైగా పోషకమైన మిల్లెట్ స్నాక్ బార్‌లను విక్రయిస్తూ, ట్రూ గుడ్‌ను 2018లో స్థాపించామన్నారు. ట్రూ గుడ్ యొక్క కళల పోటీలో 200 పైగా పాఠశాలల నుండి 5 నుండి 10వ తరగతి వరకు పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. భారత దేశంలోనే అతిపెద్ద మిల్లెట్ స్నాక్ బ్రాండ్, ట్రూ గుడ్ మొదటి ఎడిషన్‌లో ఎక్కువ మంది పిల్లల నుండి ఎంట్రీలను నమోదు చేసి, లోగో పోటీ, బ్రాండ్ యొక్క వార్షిక కళల పోటీలో భాగంగా మిల్లెట్ ఆధారిత స్నాక్స్ లేదా చిక్కీల ప్రయోజనాల గురించి పిల్లలకు తెలియజేయడం, పోషకమైన, రుచికరమైన మరియు సరసమైన అల్పాహారం ఎంపికగా, బ్రాండ్‌ను కూడా తయారు చేయడం కోసం నిర్వహిస్తున్న మన్నారు. బహుళ రిటైల్ మరియు సంస్థాగత మార్గాల ద్వారా నెలకు 6 కోట్లకు పైగా పోషకమైన మిల్లెట్ స్నాక్ బార్‌లను విక్రయిస్తోందన్నారు. ఈ సందర్భంగా విజేతులైన విద్యార్థులకు మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా.. విశాఖపట్నం జిల్లా.. థానా గ్రామానికి చెందిన పి. మధు తేజ శ్రీ (9వ తరగతి) ల్యాప్ టాప్ ను, ద్వితీయ బహుమతిగా.. కృష్ణ జిల్లా.. మచిలీపట్నానికి చెందిన ఎన్. కృష్ణ వేణి (9వ తరగతి) సాంసంగ్ ట్యాబ్... తృతీయ బహుమతిగా.. సత్యసాయి జిల్లా.. పేరూరు గ్రామానికి చెందిన డి.నవదీప్ (6వ తరగతి) లెనోవా ట్యాబ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రూ గుడ్ సంస్థ ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులను తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ మహా ధర్నా మరియు మహా ర్యాలీ







**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఎ.పి.జే.ఎ.సి పిలుపు మేరకు మంగళవారం కాకినాడ ధర్నాచౌక్‌లో ఉదయం 10.00 గంటల నుండి మధ్యానం 2.00 గంటల వరుకు జిల్లా జె.ఎ.సి అధ్వర్యంలో మహా ధర్నా మరియు మహా ర్యాలి కార్యక్రమాలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎ.పి.జే.ఎ.సి ఛైర్మన్ గుద్దటి రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ... ఉద్యోగులకు రావలసిన ఎస్.ఎల్., జిపిఎఫ్ లోన్స్, ఎపిజిఎల్ఐ, డిఎ బకాయిలు అన్నీ వెంటనే విడుదల చేయాలని మరియు 12వ పిఆర్‌సి 30% ఐఆర్ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.జే.ఎ.సి కన్వీనర్ డి.వి. రాఘవులు, ఎపిఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా శాఖల నుండి ట్రెజరీ శాఖ సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాస్, జెడ్పీ సంఘం అధ్యక్షుడు ఆర్.వి. రమేష్, టీచర్ సంఘాల నాయకులు ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు మోర్త శ్రీనివాస్, బి. మహేష్, ఎస్‌టియు కోనసీమ జిల్లా దొరబాబు, యుటిఎఫ్ నుండి కె.నగేష్, గోవింద రాజులు, తానీషా, గిరిధర్, పిఆర్‌టియు నుండి ప్రదీప్, జిల్లా ఎపిఎన్జీవో సంఘం ప్రతినిధులు సహా అధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెల్ల చంద్రరావు, కే.వి.ఎన్. వి.ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి డి.డేవిడ్ ఎలియాజర్, సంయుక్త కార్యదర్శి ఎన్.వీరబాబు, కాకినాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ, స్టేట్ కౌన్సిలర్ షేక్ అజీజ్, సిపిఎస్ సంఘ అధ్యక్షుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ షాదీ తోఫాకు లబ్ధిదారుల ధన్యవాదాలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కళ్యాణమస్తు మరియు వైఎస్ఆర్ షాదీ తోఫా లబ్ధిదారుల జంటల అభిప్రాయము వారీ మాటల్లో..... లాలా చెరువుకి చెందిన కామన సజిని మణికంఠ మాట్లడుతూ తనకు తల్లితండ్రులు ఇద్దరూ లేరని, తన చిన్నతనం నుంచి అమ్మమ్మ ఇంట పెరిగాననీ తెలిపారు. తాను కులాంతర వివాహం చేసుకున్నట్లు తెలిపారు. వాలంటీర్ ద్వారా కులాంతర వివాహం చేసుకున్న జంటలకు జగనన్న ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కొనసాగాలని వారు అభిలాష వ్యక్తం చేశారు. లాలా చెరువు కి చెందిన శ్రీకాకుళపు ఐశ్వర్యా రాణి, భార్గవ వర్మ ప్రసాద మాట్లాడుతూ వైయస్ఆర్ కళ్యాణ మస్తు పథకం ద్వారా తమకు రూ.50 వేలు ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగిందన్నారు. తమ వివాహ ఖర్చుల కోసం ఇంటికి పెద్దగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక ఆసరా ద్వారా నగదు రూపంలో బహుమతి అందించారని అన్నారు. వివాహం కు విద్యా అర్హత పెట్టడం వల్ల తప్పకుండా చదివించడం జరుగుతోందని, వివాహం తరువాత కూడా చదువు కోవడానికి వివాహ కానుక ఆసరాగా ఉపయోగ పడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని అన్నారు. జగనన్నకు ఎంతో కృతజ్ఞతలు వ్యక్తం చేసుకుంటున్నట్లు తెలిపారు.

# వైఎస్ఆర్ కళ్యాణమస్తు మరియు వైఎస్ఆర్ షాదీ తోఫా 5వ విడత సొమ్ము విడుదల

**– జిల్లాలో ఐదు విడతల్లో 1937 మందికి రూ.14.71 కోట్ల మేర లబ్ది**
**– 5వ విడతలో జిల్లాకు చెందిన 315 మంది లబ్ధిదారులకు రూ.2,53,30,000 జమ**
**– కలెక్టర్ మాధవీలత, ఎంపి భరత్ రామ్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు మరియు వైఎస్ఆర్ షాదీ తోఫా 5 వ విడతలో అర్హులైన వధువు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, భవన ఇతర నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణమస్తు పథకం కింద జిల్లాకు చెందిన 315 మంది లబ్దిదారుల జంటలకు రూ.2,35,85,000 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. కే. మాధవీ లత, ఎంపి మార్గనీ భరత్ రామ్ లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు మరియు వైఎస్ఆర్ షాదీ తోఫా 5 వ విడత ఆర్థిక ప్రయోజనాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ లబ్దిదారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కే. మాధవీలత మాట్లాడుతూ, పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి వివాహ సమయంలో ఆసరాగా నిలిచేందుకు కళ్యాణ మస్తు, షాధి తోఫా కింద ఆర్థిక సహాయం అందించడం జరుగుతోందని అన్నారు. తప్పకుండా కనీస విద్యా అర్హతలు కలిగి ఉండాలనే నిబంధన వల్ల తల్లితండ్రులు వారి పిల్లలను చదివించడం ఈ కార్యక్రమం లో అంతర్గతంగా ఉన్న ఒక గొప్ప ఆలోచన అని మాధవీలత పేర్కొన్నారు.

**–కేటగిరీ వారీగా 5 వ విడత లబ్దిదారులు :** ఎస్సీలకు రు.1 లక్ష చొప్పున 142 మందికి రూ.142 లక్షలు, ఎస్సీ లను కులాంతర వివాహాలు చేసుకున్న 12 మందికి లబ్దిదారులకు రు.1.20 లక్షలు చొప్పున రూ.14.40 లక్షలు, ఎస్టీ లకి రు.లక్ష చొప్పున 4 గురు లబ్దిదారులకు రూ..4 లక్షలు , బీసీలకు 122 మంది లబ్దిదారులకు రు.50 వేల రూపాయలు చొప్పున రూ.62 లక్షల రుపాయలు, బీసీ కులాంతర వివాహాలు చేసుకున్న 19 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున రూ.14.70 లక్షలు, మైనార్టీలకు ఒక్కొక్కరికీ రూ.1 లక్ష చొప్పున 13 గురుకి రూ.13 లక్షలు, మైనార్టీ కులాంతర వివాహాలు చేసుకున్న లబ్దిదారులకు రూ .1.20 లక్షలు చొప్పున ఒకరికీ రూ. 1.20 లక్షలు, దివ్యాంగుల లబ్దిదారులకు రు.1.50 లక్షల చొప్పున ఇద్దరికీ రూ. 3 లక్షలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎమ్. సందీప్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కే ఎస్ జ్యోతి, ఇతర అధికారులు లబ్దిదార జంటలు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలు పథకాలతో మినీ బోర్డులు ఏర్పాటు చేయాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గర్భిణీ స్త్రీలకు సంబంధించిన పథకాలు వివరాలతో మినీ బోర్డులు ఏర్పాటు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేవైద్యాధికారులను ఆదేశించారు. రంపచోడ వరం ఐటీడీఏ కార్యాలయంలో ఏడిఎం అండ్ హెచ్ఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో గర్భిణీ స్త్రీలకు సకాలంలో వైద్య సేవలను అందించడం పై సమావేశం నిర్వహించారు. అదేవిధంగా మరి కొంతమంది వైద్యాధికారులతో కాన్ఫరెన్స్ ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ప్రాజెక్ట్ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాయిన్ అయిన గర్భిణీ స్త్రీలకు ప్రతీరోజు ఏ ఆహార పదార్థాలు ఏర్పాటు చేస్తున్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీ స్త్రీలకు ఏ స్కీములు అమలు చేయుచున్నది వివరాలన్నీ డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరం ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని డెలివర్‌లు చేసింది, అదేవిధంగా ఎన్ని డెలివర్ లకు సిజేరియన్లు చేసింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఆయన ఆరా తీశారు. అలాగే ప్రస్తుతం ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, అదేవిధంగా ఎంతమంది ప్రమాదకర గర్భిణీ స్త్రీలను గుర్తించింది ఆయన ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన వివరాలు ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని, అదేవిధంగా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది గర్భిణీ స్త్రీలకు రిజిస్ట్రేషన్ చేసింది ఆరా తీశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ హాల్ లు ఎన్ని ఉన్నాయి, ఏవిధంగా పనిచేస్తున్నది వివరాలు ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న గర్భిణీ స్త్రీలకు ఏ ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారో ఆయన ఆరా తీశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామా లలో సికిల్ సెల్ ఎనీమియా టెస్టులు చెయ్యాలన్నారు. అదేవిధ ంగా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమి యాకు సంబంధించి ఎన్ని కిట్లు తీసుకువెళ్లింది, ఎంతమందికి టెస్టులు చేసింది ఇంకా ఎన్నికిట్లు ఉన్నాయి వివరాలు వైద్యాధికాం^లను ద్వారా తెలుసుకున్నారు. ఈ సమావే శంలో ఏడియం అండ్ హెచ్ఓ డాక్టర్ జి.ప్రకాశం, వైద్యాధికారులు శిరీష, రాధిక, వినోద్, నిరంజన్, సునీత, ఎంపిహెచ్ఓ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చ్3న పల్స్ పోలియో

**– పటిష్ఠ ఏర్పాట్లు – డిప్యూటి డిఎంహెచ్ఓ డా.పి.సరిత**

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :**మార్చ్3న నిర్వహించ నున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని 100శాతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.పి.సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చ్ 3న ఏర్పాటు చేసే బూత్ స్థాయిలో పెద్ద ఎత్తున పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. పెద్దాపురం డివిజన్‌లో 11 మండలాల పరిధిలో 619 బూత్‌లలో 69,080మందికి పోలియో చుక్కలు (81,280 ఓపివి డోసెస్ రిక్వైర్డ్) వేయడం జరుగుతుందని మిగిలిపోయిన చిన్నారులకు పోలియోచుక్కలు 4,5 తేదిలలో ఇంటింటికి వెళ్ళి వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంపై వివిధ మార్గాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని, ముఖ్యంగా హైరిస్క్ ప్రాంతాలను గుర్తించడంతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, తదితర చోట్ల కూడా పోలియో చుక్కలు వేసే పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు.

# నన్నయ వర్సిటీకి రూ.20 కోట్లు పీఎం-ఉష నిధులు

**– నన్నయ చరిత్రలో తొలిసారిగా ఉష నిధులు**
**– వీసీ పద్మారాజు అభినందించిన ఎంపీ భరత్**



**రాజానగరం, మేజర్‌న్యూస్ :** ఆదికవి నన్నయ యూనివర్శిటీకి మౌళిక సదుపాయాలను పటిష్టం చేయడంలో భాగంగా 'ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ ' పథకంలో రూ. 20 కోట్లు మంజూరు చేసినట్లు వీసీ ఆచార్య కె పద్మరాజు తెలియజేశారు. మంగళవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో పీఎం ఉష బడ్జెట్ ప్రకటన ప్రారంభోత్సవాన్ని ఆన్లైన్ లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే నన్నయ యూనివర్సిటీకి మంజూరైన రూ.20 కోట్లు కు సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా యూనివర్సిటీలు పీఎం ఉష నిధులకు ప్రయత్నించగా ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ ' పథకంలో 20 కోట్లు మంజూరు కావడం హర్షనీయమని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. నేడు విశ్వవిద్యాలయాలకు పీఎం – ఉష ఆధ్వర్యంలో 78 ప్రాజెక్టులకు రూ.3600 కోట్లకు పైగా బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ జమ్మూ కాశ్మీర్ నుంచి ప్రకటించారని తెలిపారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడే విధంగా పీఎం ఉష పథకంలో నుండి రూ.20 కోట్లు నన్నయ విశ్వవిద్యాలయానికి మంజూరు అయ్యాయని ఆనందాన్ని వ్యక్తం చేసారు. రూ.10 కోట్లతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కొరకు మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. త్వరలో ఇంటర్ డిసిప్లినరీ మరియు మల్టీడిసిప్లినరీలో పరిశోధన కోసం రిసోర్స్ సదుపాయం–అధునాతన అభ్యాసానికి మరియు కొత్త పరిశోధన నైపుణ్యాలకు బహిర్గతం అవుతాయన్నారు. భోధనా సౌకర్యాల పునరుద్ధరణ మెరుగైన బోధన మరియు అభ్యాస ప్రమాణాలకు దారితీస్తుందన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక విశ్వవిద్యాలయాలు పీఎం ఉష నిధులకు పోటీపడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నిధులు మంజూరు కావడంలో గొప్ప విషయమని, దీనికి కృషి చేసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు ను అభినందించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నుండి రూ.8 కోట్లకు పైగా నిధులతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన వీసీ పద్మరాజు ను శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న ఎంపీ మార్గాని భరత్ ను వీసీ సన్మానించి అభినందించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల అసోసియేషన్ నాయకులు, ఈసీ మెంబర్స్, ఆయా కళాశాలల అధ్యాపకులు వీసీ పద్మరాజుకు అభినందనలు తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి విశేషాలను తెలియజేసారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వీసీ పద్మరాజు ప్రణాళికలను నిబద్దతను ప్రశంసించారు. ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ ' పథకం యొక్క లక్ష్యాలను, కార్యక్రమాలను హానరరీ ప్రొఫెసర్ కె.వి.రావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ మెంబర్ గంధం నారాయణరావు, రాజమహేంద్రి కాలేజ్ టీ.కె. విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య కాలేజ్ డా.సుగుణ, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, అనూరా అలోమ్ని అసోసియేషన్ నాయకులు, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సమాజంలో నెలకొన్న సామాజిక అసమానతలను తొలగించడానికి న్యాయస్థానాలు కృషి చేస్తున్నాయని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సామాజికన్యాయ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ధనిక, పేద వర్గాల అసమానతలను తొలగించాల్సి ఉందన్నారు. సమాజంలో ఏర్పడిన సామాజిక అసమానతలను తొలగించి తరతరాలుగా జరిగిన సామాజిక దురన్యాయాన్ని సరిదిద్దాలని అన్నారు. పేదరిక నిర్మూలన, అందరికీ చదువు, సమన్యాయం, గౌరవంగా పనిచేయగలిగే స్థితి కలగాలని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కొరతతో సామర్లకోట మున్సిపాలిటీలో ఇబ్బందులు

**– సామర్లకోట మునిసిపాలిటీలో అధికారులు కొరత**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీలో అధికారులు లేక మున్సిపల్ పాలన అస్తవ్యస్థంగా మారింది. దాదాపు ఎనిమిది మంది అధికారులు లేక ఆయా శాఖలు వెలవెల బోతున్నాయి.ప్రజా సమస్యల పరిష్కారానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ప్రధానమైన శాఖలకు సంభందించి అధికారుల ఖాళీలు చాలా రోజులుగా ఉండటంతో ప్రజలకు అందించే సేవల విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.మున్సిపల్ కమిషనర్ జె.రామారావు విధుల్లో ఉంటుండగా ఇక ముఖ్యంగా మున్సిపల్ మేనేజర్ ఆరోగ్య సమస్య కారణంగా ఇటీవల సెలవుపై వెళ్లారు.ఇంజనీరింగ్ శాఖలో ఎఇ తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రజారోగ్య శాఖలో సానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టు ఏళ్ళ తరబడి ఖాళీగా ఉండటంతో ఇంచార్జ్ భాధ్యతల్లోనే కొనసాగుతోంది.కాగా ఇటీవల ప్రజారోగ్య శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న పొడుగు చిట్టిబాబు గుండె పోటుతో మృతి చెందగా ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దానితో ఆయా శాఖల పరిధిలో సమస్యలు ఉన్న ప్రజలు వారి సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వెళ్లినా అధికారుల కొరత కారణంగా ఏ పనులు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. దానికి మించి ప్రస్తుతం రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంతమంది అధికారులు అందుబాటులో లేకుండా ఎన్నికల విధులను ఎలా ఎదుర్కోవాలని మున్సిపల్ కమిషనర్ ఆలోచిస్తున్నారు.ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సామర్లకోట మున్సిపాలిటీలో అధికారుల ఖాళీలను భర్తీ చేసి ప్రజలకు అందించే సేవలను మెరుగు పరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## జగనన్న ప్రభుత్వ రధసారథులు వాలంటీర్లు

**– ఒమ్మి రఘురామ్**



**జగ్గంపేట, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు రధ సారథులు వాలంటీర్లు అని కాకినాడ జిల్లా జె సి యస్ కో ఆర్డినేటర్,వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామచంద్రాపురం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ అన్నారు. ఈరోజు జగ్గంపేట మండలం, కాండ్రేగుల మరియు గుర్రంపాలెం గ్రామ సచివాలయాలలో సచివాలయ కార్యదర్శులు షేక్ షకీలా, తోట దేవి ల అధ్యక్షతన జరిగిన వాలంటీర్ల కు అవార్డులు పంపిణీ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ ద్వారా జగనన్న ప్రభుత్వంలో కోటి నుండి కోటీ ఇరవై లక్షల రూపాయలు వారి 50 నుండి 70 కుటుంబాలకు లబ్ది చేకూర్చాలని తెలియ జేసారు.రాష్ట్రంలో జరిగే అవినీతిరహిత, పారదర్శకపా లనకు వాలం టీర్లే పాత్రధారులు అన్నారు. ఈరోజు వాలంటీర్ల కు ఉన్న గౌరవం నాయకులకు కూడా లేదన్నారు. మీరు మరింత ఉత్సాహంగా పనిచేసి పేదలకు మేలు చేయడానికే ఈ సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులు జగనన్న ఇస్తున్నా రని అన్నారు. కాండ్రేగులలో 16 మందికి గుర్రంపాలెం సచివాల య పరిధిలో 21 మందికి ఈరోజు సన్మానాలు చేసి సర్టిఫికెట్ లు, బ్యాడ్జులు అందించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సర్పంచ్ బొదిరెడ్డి చక్రరావు, గుర్రంపాలెం సర్పంచ్ చీపురుపల్లి లక్ష్మీ రాఘన, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, వరుపుల సూరిబాబు, అబిరెడ్డి వీరబాబు, పడాల రాజశేఖర్,పలువురు సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.